ప్రజాశక్తి
మంగళవారం 29 ఏప్రిల్ 2025
5
పార్వతీపురం మన్యం

## సీతంపేటలో కుండ పోత వర్షం

**సీతంపేట :** మండలంలో సోమవారం సాయంత్రం కుండపోత వర్షం కురవడంతో ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది. గత నాలుగు, ఐదు రోజులుగా రోజురోజుకు భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ప్రతి రోజు 37 డిగ్రీల నుంచి 42 డిగ్రీల వరకు సూర్యుడు సుర్రుమనడంతో ప్రజలు ఎండను తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ తరుణంలో సోమవారం ఈదురు గాలులతో కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రజలకు ఉపశమనం మిగిల్చింది.

**వీరఘట్టం:** మండలంలో ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. గత కొద్ది రోజుల నుండి భానుడు భగభగ మండిపోవడంతో సోమవారం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడడంతో కొంతమేర ఊరట నిచ్చిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడడంతో రహదారులు బురదమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతుసంఘం నాయకులు కృష్ణమూర్తి, రైతులు

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నిర్వాసిత రైతులు

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న మిడ్ లెవెల్ హెల్త్ సర్వీస్ ప్రొవైడర్లు

## దేశిబట్టి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్**

మండలంలోని దోకిశీల వద్ద యథేచ్ఛగా నీరు పారే గెడ్డలను, కాలువలను కప్పేసి గిరిజనులపై పెత్తనం చెలాయిస్తున్న చింతల జగన్నాథం నాయుడుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో దోకిశీల సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సచివాలయం విఆర్ఒకు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ దోకిశీల రెవెన్యూ పరిధిలో గల 107, 106/ 11 సర్వే నెంబర్లలో దేశిబట్టిని మాజీ విఆర్ఒ చింతల జగన్నాధం నాయుడు ఆక్రమించి, కాలువలను పూర్తిగా కప్పేయడం అన్యాయమని అన్నారు. ఈ ఆక్రమణపై గతంలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినా కనీసం స్పందించకపోవడం చాలా దారుణమని మండిపడ్డారు. ఆక్రమణలను తొలగించడమే ప్రధాన కర్తవ్యంగా కంకణం కట్టుకున్న ఎమ్మెల్యే, అధికారులు దేశిబట్టి ఆక్రమణపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. పార్టీలకు అతీతంగా అధికారులు విధులు నిర్వర్తించాలని కోరారు. గెడ్డ ఆక్రమణ వల్ల సాగునీరందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కావున ఇకనైనా అధికారులు స్పందించి తక్షణమే ఆక్రమణను తొలగించి కాలువలను గతంలో ఉన్నట్లే తవ్వి రైతులకు సాగునీరివ్వాలని, ఆక్రమణ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు బేత నరసింహారావు, బెలుసు నాగేశ్వరరావు, బెలుసు గణపతి, బిటిశిల సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్**

తోటపల్లి బ్యారేజీ నిర్వాసిత గ్రామం పిన్నింటి రామినాయుడు వలస సమస్యలు తక్షణమే పరిష్కరించాలని నిర్వాసిత గ్రామ స్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వాసితుల సంఘం నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పిన్నింటి రామినాయుడువలస గ్రామానికి నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇళ్ల నిర్మించుకోవడానికి కేటాయించిన స్థలంలో అనేక మంది ఇళ్లు నిర్మించుకుంటున్నారని, అయితే ఇంత వరకు నిర్మించుకున్న చాలా మందికి బిల్లులు చెల్లించలేదని చెప్పారు. ఇంటికి నిర్మాణ వ్యయం ప్రభుత్వం ఎంత కేటాయించిందో అధికారులు చెప్పడం లేదన్నారు. తమ గ్రామానికి కేటాయించిన స్థలంలో అంగన్వాడీ భవనం, స్కూలు భవనం, కమ్యూనిటీ భవనం, తాగునీటి సదుపాయాలు ఇంత వరకు కల్పించలేదన్నారు. కొంత మంది వితంతువులకు, అర్హులైన వారికి కూడా స్థలాలు కేటాయించలేదన్నారు. తోటపల్లి బ్యారేజీ భూములు ఇచ్చి సమస్యలు ఎదుర్కొంటున్న తమకు అధికారులు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం నాయకులు బంటు దాసు, గేదెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మిడ్ లెవెల్ హెల్త్ సర్వీస్ ప్రొవైడర్ల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్**

వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని హెల్త్ సబ్ సెంటర్లలో పనిచేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ సర్వీస్ ప్రొవైడర్ల సమస్యలు పరిష్కరించాలని సర్వీస్ ప్రొవైడర్ల యూనియన్ అధ్యక్షులు సిహెచ్ జగదీష్, ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, రాజేశ్వరి సిఐటియు జిల్లా కార్యదర్శి బి.వి.రమణ డిమాండ్ చేశారు. సోమవారం మిడ్ లెవెల్ హెల్త్ సర్వీస్ ప్రొవైడర్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. గత ఆరేళ్లుగా ఈ మిడ్ లెవెల్ హెల్త్ సర్వీస్ ప్రొవైడర్ల వ్యవస్థను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అప్పటి నుంచి వీరి సర్వీస్ రెగ్యులరైజ్ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. జీతంతో పాటు ఇవ్వాల్సిన 15 వేల అలవెన్స్ కూడా పూర్తి స్థాయిలో పొందలేకపోతున్నారని, దానికి అనేక నిబంధనలు అటంకంగా మారాయని గుర్తు చేశారు. సుమారు జిల్లాలో 80 హెల్త్ సబ్ సెంటర్లు అద్దె భవనాలలో నిర్వహిస్తున్నా రని వాటికి గత ఆరు నెలలుగా అద్దె చెల్లించడం లేదని ఆరోపించారు. ఈ సర్వీస్ ప్రొవైడర్లకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం లేదని వెంటనే అమలు చేయాలని, గతంలో ప్రభుత్వ ఉద్యోగులకు పెంచిన విధంగా 23శాతం జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. వీరికి హెచ్ఆర్ పాలసీ అమలు చేసి కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వీరందరినీ వైద్యారోగ్య శాఖలో విలీనం చేసి వీరిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. మిడ్ లెవెల్ హెల్త్ సర్వీస్ ప్రొవైడర్ల రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడుతున్నందున తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆ సంఘ నాయకులతో చర్చలు జరిపి సమస్యలపై సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.ప్రశాంత్, టి. జాకబ్ పాల్గొన్నారు.

## త్వరితగతిన రెవెన్యూ సమస్యలు పరిష్కారం : కలెక్టర్

**ప్రజాశక్తి - పార్వతీపురం**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందే రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలని, అందుకు తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకొని, క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. సమస్యను బట్టి 24 గంటల నుంచి 48 గంటల్లోగా పరిష్కారం కావాలని సూచించారు. సమస్య పరిష్కారంతో అర్జీదారుడు సంతృప్తి చెందాలని, పరిష్కారం కాని సమస్య ఉంటే అందుకు గల కారణాలను సవివరంగా పూర్తి సమాచారంతో అర్జీదారుకు తెలియజేయాలని అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్సి ప్రత్యేక ఉప కలెక్టర్ డా.పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్డిఎ ప్రాజెక్ట్ అధికారి ఎం.సుధారాణితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు. అర్జీలను సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యలపై ఎక్కువ వినతులు రాగా, రీసర్వే, భూ వివాదాలు, ఉపాధి అవకాశాలు, పౌర సరఫరాల సేవలు, గృహ పట్టాలు, మంజూరు, పింఛన్లు, తదితర సమస్యలకు సంబంధించిన 88 మంది అర్జీదారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరుకు వినతులు అందజేశారు. కార్యక్రమం లో వివిధ గ్రామాలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**సీతంపేట:** స్థానిక ప్రభుత్వ ఐటిఐలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, మెకానిక్ మోటార్ వెహికల్, వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రెస్ మేకింగ్‌లో సీట్లు భర్తీకి గానూ ఆసక్తి గల ఎస్‌టి అభ్యర్థులు ఆన్‌లైన్‌లో iti.ap.gov.in వెబ్ సైట్‌లో ఈనెల 28 నుండి మే నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ నమోదు యునిక్ నంబర్, అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లతో తమ దగ్గరలో గల ఏ ప్రభుత్వ ఐటిఐలోనైనా వెరిఫికేషన్ (ధ్రువీకరణ) చేయించుకొని అప్రోవల్ (ఆమోదం) చేయించుకోవాలని, అలా చేసిన వారి పేర్లు మాత్రమే మెరిట్‌జాబితాలో నమోదవుతాయన్నారు. మెరిట్ లిస్టులో ఉన్నవారికి, కేటాయించిన తేదీ ప్రకారం కన్వీనర్/ ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటిఐ, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా వారి ద్వారా మొదటి విడత కౌన్సిలింగ్ సాలూరు ప్రభుత్వ ఐటిఐలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్రోవల్ (ఆమోదం) కానివారి పేర్లు మెరిట్ లిస్టులో నమోదు కావన్నారు. మరిన్ని వివరాలకు 7569062449, 93900 63881, 94419 30405, 94911 34464 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు

## ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన. : సిఐటియు

**ప్రజాశక్తి - మక్కువ**

దేశంలో కార్మిక వర్గం ఐక్యతను పెంపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై, కార్మికులకు నష్టం చేసే చట్టాలను రద్దు చేసే వరకూ పోరాటాలు నిర్మించడం, వాటిని ముందుకు తీసుకెళ్లడంలో సిఐటియు ముందు వరుసలో నిలుస్తుందని జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు తెలిపారు. మక్కువలో సిఐటియు మండల కన్వీనర్ జి.కృష్ణ అధ్యక్షతన మండల విస్తృత స్థాయి సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ మూడో సారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ గెలిచాక కార్మికవర్గం కష్టాలు తీర్చకుండా, దేశానికి బ్యాంకులకు ఎగనామం పెట్టే దోపిడీదారుల కష్టాలు ఆలోచిస్తున్నారని ఎద్దేవా చేశారు. అతి తక్కువ జీతాలతో పని చేస్తున్న మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, స్వీపర్లు, విఆర్‌ఎలు, అంగన్వాడీ, ఆశా, సిహెచ్ డబ్ల్యూ, గ్రీన్ అంబాసిడర్ ఇలా అనేకమంది అసంఘటిత రంగంలో రోజువారి కనీస కూలి కూడా లేని పరిస్థితి రాష్ట్రంలో, దేశంలో ఉందని, వీరి గురించి పాలకులు ఆలోచించడంలేదని విమర్శించారు. అందుకే మే1 హక్కుల దినోత్సవం రోజున, కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పక్షాన నిలవకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడానికి నిరసిస్తూ ఐక్యంగా పోరాటాలకు సిద్ధపడాలని, అందులో భాగంగానే మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు, కార్మికులు ఐక్యమై కార్మిక వ్యతిరేక విధానాలపై నినదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కో కన్వీనర్, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎల్.దాలమ్మ, విఆర్‌ఎల సంఘం మండల జి.పవన్, భోజనం నిర్వాహకుల సంఘం నాయకులు ఎం.కృష్ణ, పార్వతి, స్వీపర్ సంఘం నాయకులు టి.సిమ్మమ్మ, లక్ష్మి, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు తాడంగి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

**పాలకొండ :** లేబర్ కోడ్ రద్దు చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చింతల సంజీవి అన్నారు. కార్మిక వర్గానికి నష్టం చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని సోమవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జరిగిన విస్తృత సమావేశం సమ్మె ప్రచార పత్రాన్ని యూనియన్ నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి పి వేణు, విమల, శ్రీదేవిచ రఘు, భాస్కరరావు, ఆంజనేయులు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్కంఠ నడుమ చైర్మన్‌గా ఆకుల మల్లేశ్వరి

### ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కూటమి ప్రభుత్వం

**ప్రజాశక్తి - పాలకొండ**

స్థానిక నగర పంచాయతీ చైర్మన్ ఎన్నికల ఉత్కంఠ నడుమ సోమవారం జరిగింది. చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు కేటాయించారు. 20 వార్డులకు గాను 19వ వార్డుకు చెందిన రాధాకుమారి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో రెండో వార్డుకు చెందిన ఎస్సీ రిజర్వేషన్ చెందిన ఆకుల మల్లేశ్వరికి ఆ పదవ దక్కుతుందని భావించారు. వైసిపికి సంఖ్యా బలం ఉండడంతో వారు ఇప్పటికే రెండుసార్లు సమావేశానికి గైర్హాజరవ్వడంతో కోరం లేక వాయిదా పడింది. చివరికి సోమవారం మరోసారి చైర్మన్ ఎన్నిక జరగ్గా మల్లేశ్వరి ఎంపికయ్యారు. అయితే మల్లేశ్వరికి టిడిపిలో ఒక గ్రూపునకు చెందిన వారు మద్దతు ఇస్తారా? లేదా అన్న అనుమానాలు తలెత్తాయి. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, పట్టణ టిడిపి సీనియర్ నేత పల్లా కొండలరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్ తదితరలు చర్చలు జరిపారు. ఉదయం 11.30 సమయంలో ఎమ్మెల్యేతో పాటు మల్లేశ్వరి, టిడిపికి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు, జనసేనలో చేరిన కౌన్సిలర్ గంగునాయుడు నగర పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. మల్లేశ్వరి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఎన్నికల అధికారి అయిన జాయింట్ కలెక్టర్ శోభిక ముందు చెప్పగా టిడిపికి చెందిన ఆరో వార్డ్ కౌన్సిలర్ అడపా జయ ప్రతిపాదించారు. 20వ వార్డ్ కౌన్సిలర్ గంట వరలక్ష్మి ఆమోదించారు దీంతో చైర్మన్‌గా మల్లేశ్వరిని ఎన్నికల అధికారి ప్రకటించారు. నగర పంచాయతీ చైర్మన్ పీఠం విషయంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకుంది. జిల్లా ఇన్చార్జి మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో ఆకుల మల్లేశ్వరి, ఆమె భర్త కుమార్ టిడిపిలో చేరారు. అప్పటి నుంచి ఎలాగైనా ఈ పదవి కట్టబెట్టి కూటమి ఖాతాలో చేర్చాలని మంత్రులు గట్టి ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. సోమవారం పట్టణ వైసిపి అధ్యక్షులు మన్మధరావు, సీనియర్ నాయకులు ధవళేశ్వరరావు మల్లేశ్వరికి పార్టీ తరపున బి-ఫారం కూడా ఎన్నికల అధికారికి అందజేశారు. విప్ కూడా జారీ చేశారు. అయితే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని చెప్పినప్పటికీ ఆమోదించడం పట్ల వైసిపి వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిక ఎలా జరిపారంటూ ఆరోపిస్తున్నారు.



చైర్‌పర్సన్‌గా రాజేశ్వరికి నియామక పత్రాన్ని అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ శోభిక

**ఎన్ని కుట్రలు పన్నినా విజయం మాదే : మంత్రి సంధ్యారాణి**

వైసిపి ఎన్ని కుట్రలు పన్నినా కూటమి ఖాతాలోనే నగర పంచాయతీ పీఠం చేరిందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయానికి చేరుకొన్న ఆమె చైర్మన్‌గా ఎన్నికైన ఆకుల మల్లేశ్వరికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ నగర పంచాయతీ పూర్తిగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇప్పటికే రెండుసార్లు కుట్రలపైనే చైర్మన్ ఎన్నిక జరగకుండా వాయిదా వేశారన్నారు. నగర పంచాయతీ అభివృద్ధికి శ్రీకారం చూడతామన్నారు. తమ అభివృద్ధి చూసి కౌన్సిలర్లు కూడా తమ వైపు వస్తున్నారన్నారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. ఎన్ని అడ్డంకులు వేసినా చైర్మన్‌గా విజయం సాధించామన్నారు. బాధ్యతగా పనిచేసే నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అరుకు పార్లమెంట్లు పార్టీ ఇంచార్జ్ కిడారి శ్రావణ్ కుమార్, పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పడాల భూదేవి, తదితరులు ఉన్నారు

**నైతిక విజయం మాదే : ఎమ్మెల్సీ విక్రాంత్**

స్థానిక నగర పంచాయతీ చైర్మన్ ఎన్నికల్లో నైతిక విజయం తమదేనని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. సోమవారం ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ వైసిపితో గెలిచిన కౌన్సిలర్‌ను అడ్డదారిలో చైర్మన్‌గా చేసి గొప్పలు చెప్పుకోవడం సమంజసం కాదన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ఎన్నికలు జరపడం అన్యాయమన్నారు. తాము బి-ఫారం కూడా ఇచ్చామని, విప్ కూడా జారీ చేశామని, అయినా అధికారాన్ని అడ్డం పెట్టుకొని విలువలు పాటించకుండా దౌర్జన్యంగా చైర్మన్ పీఠం దక్కించుకోమన్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తమ కౌన్సిలర్లు అంతా క్రమశిక్షణతో కట్టుబడి ఉన్నారని, ఇప్పటికే నగర పంచాయతీలో తమకే బలం ఉందని, అయినా అభివృద్ధికి తాము అడ్డు రాబోమని తెలిపారు. అయితే ఒంటెద్దు పోకడలతో ఇబ్బందులు పెడితే ఊరుకోమన్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వాస రాయి కళావతి మాట్లాడుతూ నిరంకుశత్వ పాలనకు ఈ ఎన్నికే నిదర్శనమన్నారు. ఇలాంటి దుర్మార్గ పాలన చేయొద్దని, లేకుంటే ప్రజలే బుద్ధి చెప్తారన్నారు విలేకరుల సమావేశంలో పట్టణ వైసిపి అధ్యక్షులు వెలమల మన్మధరావు, సీనియర్ నాయకులు ధవళేశ్వరరావు, కౌన్సిలర్లు ఉన్నారు.

## చెరువులను పరిరక్షించాలి : కలెక్టర్

### వేసవిలో తాగునీటి సమస్య ఉండడానికి వీల్లేదు

**ప్రజాశక్తి - పార్వతీపురం**

జిల్లాలో చెరువులు ఆక్రమణకు గురికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులను అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని చేపట్టబోతున్నామని, కావున రెవిన్యూ, పోలీస్, సర్వే అధికారులు సంయుక్తంగా చెరువులను, వాటి సరిహద్దులను గుర్తించాలని స్పష్టం చేశారు. చెరువులు ఆక్రమణకు గురైనట్లు గుర్తిస్తే వాటి వివరాలను పంచాయతీ అధికారికి తెలియజేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో పలు అంశాలపై కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవలో భాగంగా ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను మే 1వ తేదీ ఉదయం శత శాతం పంపిణీ చేసేలా మండల ప్రత్యేక అధికారులు చొరవ చూపాలన్నారు. జిల్లాలో వీలైనన్ని నీటికుంటలను నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని, వాటిని ఏర్పాటు చేసేందుకు ఇది తగిన సమయమైనందున అధికారులు ప్రత్యేక దష్టి సారించాలని తెలిపారు. ఉపాధి హామీ శ్రామికులకు బీమా వర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, పిఎం కుసుం కొరకు ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని కలెక్టర్ వివరించారు. అనీమియా యాక్షన్ కమిటీలకు రిజిష్టర్లను పంపిణీ చేయడం జరిగిందని, మహిళా పోలీసు అందరినీ సమన్వయపరచి కమిటీలు ఏర్పాటు చేసి, కమిటీలో తీసుకున్న నిర్ణయాలను రిజిష్టర్ నందు నమోదు చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య ఉండటానికి వీల్లేదని కలెక్టర్ తేల్చిచెప్పారు. అలాగే జిల్లాలో అసంపూర్తిగా ఉన్నటువంటి ప్రభుత్వ భవన నిర్మాణాలన్నింటిని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కౌలు రైతులకు ఇచ్చే సీసీఆర్సీ కార్డులపై అవగాహన కల్పించి, వాటిని మంజూరుచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సిపిఒ పి.వీర్రాజు, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖల అధికారులు కె.రాబర్ట్ పాల్, బి.శ్యామల, డా.ఎస్.మన్మధరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డిపిఒ టి.కొండల రావు, జిల్లా పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులు బి.చంద్రశేఖర్, ఓ.ప్రభాకరరావు, మునిసిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, ఎపిఇపిడిసిఎల్ పర్యవేక్షక ఇంజినీర్ కె.చలపతిరావు, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఆర్.కృష్ణవేణి, డిఎల్‌డిఒ రమేష్‌రామన్, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వనకాబడి చెక్‌డాంను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

## చెక్ డ్యామ్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

**ప్రజాశక్తి - కొమరాడ**

మండలంలోని చినకేర్జల పంచాయతీ బట్టిమనుగివలసలో వనకాబడి గెడ్డ వాగుపై నిర్మించనున్న చెక్ డ్యామ్ స్థలాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్శనలో బోయలబండ ట్యాంక్, కనపల ట్యాంక్, పెద్ద ట్యాంక్‌లకు అనుసంధానించే ప్రతిపాదిత చెక్ డ్యామ్‌తో కూడిన క్యాస్కేడ్ లింకేజీ వ్యవస్థపై నీటిపారుదల ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ క్యాస్కేడ్ వ్యవస్థ ద్వారా సుమారు 410 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే అవకాశం ఉంటుందని కలెక్టరుకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో పార్వతీపురం డివిజన్ నీటి పారుదల శాఖ ఇఇ ఆర్.అప్పల నాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆ రూ.2 కోట్లు రుణమా? గ్రాంటా?

### పండగలోపు అభివృద్ధి పనులు జరిగేనా?
### అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు

**ప్రజాశక్తి - సాలూరు**

మున్సిపాలిటీకి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రెండు కోట్ల రూపాయల నిధులు అప్పు కింద మంజూరయ్యాయా, గ్రాంటుగా విడుదల చేశారా అని పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. సోమవారం చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో సభ్యులు పలు ప్రశ్నలను అడిగారు. రెండు కోట్ల రూపాయలు మున్సిపాలిటీకి మంజూరయ్యాయని చెపుతున్నారని, ఆ నిధులు దేనికి సంబంధించినవో స్పష్టత ఇవ్వాలని వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరి రఘు, రాపాక మాధవరావు, బి.శ్రీనివాసరావు నిలదీశారు. దీనిపై మున్సిపల్ డిఇ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో 40 మున్సిపాలిటీలకు నిధులు మంజూరయ్యాయని, సాలూరు మున్సిపాలిటీకి రూ.2 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. 2019-20 సంవత్సరాలకు సంబంధించిన ఎల్ఆర్ఎస్, బిఆర్ఎస్ గ్రాంట్లకు సంబంధించిన నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ రెండు కోట్లు అప్పేనని, మున్సిపాలిటీ తిరిగి ప్రభుత్వానికి చెల్లించాల్సిన అవసరం ఉందని డిఇ చెప్పారు. శ్యామలాంబ పండుగలోపు ఈ నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేస్తారా అని ప్రశ్నించగా, అందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని డిఇ చెప్పారు. పండుగ లోపు ఈ నిధులతో అభివృద్ధి పనులు ఎలా పూర్తి చేస్తారని, పండుగకు 15రోజులే గడువు వుందని కౌన్సిలర్లు ప్రస్తావించగా డిఇ ప్రసాద్ నీళ్ళు నమిలారు. పండగలోపు పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని డిఇ చెప్పారు. విద్యుత్ దీపాలాలంకరణకు రూ.4 లక్షలు ఎందుకని, ఉత్సవ కమిటీ తరపున లైటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారని, ఆ నిధులు ఇంకో పనికి వినియోగించాలని సూచించారు. పట్టణానికి చెందిన జుయెలరీ షాప్ యజమాని మున్సిపాలిటీ పేరుతో లైటింగ్ ఏర్పాటు చేస్తానని ముందుకొచ్చారని, దీనికి అనుమతి మంజూరు చేయాలని వారు కోరారు. మున్సిపాలిటీలో పైలట్ వాటర్ స్కీంలు ఎక్కడెక్కడ అవసరమో వార్డు కౌన్సిలర్లను అడిగితే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. తన వార్డులో పాడైపోయిన పైలట్ వాటర్ స్కీంలు మరమ్మతు చేయాలని ఎంతో కాలంగా అడుగుతుంటే కొత్త స్కీంలు ఎందుకు మంజూరు చేశారని కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు ప్రశ్నించారు. 24వ వార్డులో మురికి కాలువలు నిండిపోయాయని, దీంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోందని కౌన్సిలర్ బి.హైమసత్యవతి చెప్పారు. 26వ వార్డులో పారిశుధ్యం అధ్వాన్నంగా వుందని, మెరుగుకు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ పి.సన్యాసమ్మ డిమాండ్ చేశారు. సమావేశంలో కమిషనర్ డిటివి కృష్ణారావు, వైస్ చైర్ పర్సన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సమస్యలను నిలదీస్తున్న కౌన్సిలర్లు

## అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

**ప్రజాశక్తి - సీతంపేట**

స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల 2 మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం స్థానిక ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఇంటర్వ్యూలు నిర్వహించారు. సీతంపేట మండలం వెంపలగూడ, రాజు గారి గూడ మినీ అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్త పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వెంపలగూడ కేంద్రానికి దరఖాస్తు చేసుకున్న ముగ్గురు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రాజుగారి గూడ కేంద్రానికి ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడంతో దానికి ఇంటర్వ్యూ నిర్వహించలేదు. ఎంపికైన అభ్యర్థులకు తర్వాత సమాచారం అందిస్తామని పిఒ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయపార్వతి, సిడిపిఒలు పి.రంగలక్ష్మి, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## లే అవుట్‌లో పేర్లు ఉన్నవారు తెలియజేయండి

ప్రజాశక్తి - వీరఘట్టం

జగనన్న శాశ్వత గృహ లేఔట్‌లో పట్టా పొందిన వారు గృహాలు నిర్మించుకునేందుకు సొంత స్థలం ఉన్నట్లయితే వారి వివరాలు గృహ నిర్మాణ శాఖ కార్యాలయానికి తెలియజేయాలని, స్థానిక గృహ నిర్మాణ శాఖ ఎఇ వి.వినోద్ కుమార్ పట్టాదారులను కోరారు. జగనన్న లేఅవుట్లో పేర్లు ఉండటం వల్ల సొంత స్థలాలు ఉన్న వాటికి గృహాలు కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ వీటి కారణంగా పక్క గృహాలు మంజూరు కాలేదన్నారు. వీరఘట్టం మండల కేంద్రానికి సంబంధించి అచ్చుపవలస గిరిజన గ్రామం వద్ద అప్పట్లో సుమారు 274 మందికి పట్టాలు ఇచ్చారని, వాటిని రద్దు చేసుకొని నూతనంగా గృహాలు కావాలనుకుంటే ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఏమైనా సందేహాలు ఉంటే గృహ నిర్మాణ శాఖ కార్యాలయానికి వెళ్లి వివరాలు తెలుసుకోవచ్చునని ఆయన స్పష్టం చేశారు.

## గిరిజనులపై హీరో విజయ్ వ్యాఖ్యలు సరికాదు

ప్రజాశక్తి- సీతంపేట

రెట్రో సినిమా ప్రమోషన్ ఫంక్షన్‌లో హీరో విజయ్ దేవరకొండ ఆదివాసీలపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని సీతంపేట ఆదివాసి జాయింట్ ఫ్యాక్షన్ కమిటీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు బిడ్డిక శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు సవర చిరంజీవులు, కార్యదర్శులు బిడ్డిక ఉమామహేశ్వరరావు, కొండగొర్రి భాస్కరరావు, తోయిక తిరుమలరావు, సవర విష్ణు, బిడ్డిక రామ్మోహన్ రావు మాట్లాడుతూ రెట్రో సినిమా ప్రమోషన్ ఫంక్షన్‌లో భాగంగా గిరిజనులను కించపరిచే విధంగా 500 ఏళ్ల నాటి చరిత్ర తెలిసినట్లు గిరిజనులను హేళన చేస్తూ హీరో విజయ్‌దేవరకొండ వేదికలపై మాట్లాడడం సరికాదన్నారు. ఆ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని లేని పక్షంలో ఆదివాసి సమాజం నుంచి తీవ్రమైన న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

డొక్కా సీతమ్మ చిత్రపటానికి పూలమాలవేస్తున్న సంజీవ్‌నాయుడు

## ఘనంగా డొక్కా సీతమ్మ వర్ధంతి

ప్రజాశక్తి - బలిజిపేట

ఆంధ్రుల అన్న పూర్ణ గా చరిత్ర లో చిర స్థాయి గా నిలిచి న డొక్కా సీతమ్మ తల్లి వర్ధంతి కార్యక్రమం మండలంలోని పెదపెంకిలో గల నేతాజీ గ్రంథాలయం వద్ద ఆ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ్ నాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సామాజిక కార్యకర్తగా ఆమె తన జీవితంలో ఎక్కువ భాగం పేదలను, ప్రయాణికులను ఆదుకున్నారని కొనియాడారు. నిత్య అన్నదానం అన్నపూర్ణగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో ఒప్పంగి ఆదినారాయణ, తుమరాడ శివ, గులిపల్లి సుదర్శన్ రావు, రౌతు శ్రీను, టేకు శంకరరావు, చుక్క అప్పలనాయుడు, ఎ.బలరాం, బొద్దాన తాతబాబు, ఇ.చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి పత్రాన్నిస్తున్న విఆర్‌ఎలు

## విఆర్‌ఎల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - కురుపాం

తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 30న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాకు హాజరు కానున్న దృష్ట్యాగా ముందస్తు సమాచారం మేరకు స్థానిక తహశీల్దార్ ఎం.రవణమ్మకు సోమవారం విఆర్‌ఎల సంఘ జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఆర్‌ఎల దీర్ఘకాలిక సమస్యలైన పే స్కేల్స్, అర్హత ఉన్న వారికి ప్రమోషన్లు తదితర సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్లతో గత ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని, కూటమి ప్రభుత్వమైనా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతు ధర్నా చేపడుతున్నామని తెలిపారు. కావున జిల్లాలో గల విఆర్‌ఎలంతా పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు విఆర్‌ఎలు పాల్గొన్నారు.

## వేసవి శిబిరాలు ప్రారంభం

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాన్ని ఉత్తరాంధ్ర ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ నూతలపాటి భరతభూషణ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు వేసవిలో ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల వారిలో గల సృజనాత్మకతను వెలికి తీసుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో తంపటాపల్లి డ్రాయింగ్ మాస్టారు గొర్లె మురళి, బాసూరి వారి వీధి సచివాలయం అడ్మిన్ కె.శివ, ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

## రక్షిత నీరు కల్పించండి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ పెదగైసిలలో రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పిఎంకె రెడ్డిపి కోరారు. ఆ గ్రామంలో తాగునీటి సౌకర్యం ఎలా ఉందన్న అంశంపై సోమవారం ఆయన ఆ గ్రామాన్ని పరిశీలించారు. గ్రామంలో మినీ వాటర్ ట్యాంక్ దాతలు ఏర్పాటు చేశారని, దాన్నే చాలామంది వినియోగించుకోవాల్సి వస్తుందని గ్రామస్తులు డిఇకి మొరపెట్టుకున్నారు. దీనిపై ఆయన రక్షిత పథకానికి సంబంధించి అంచనా తయారు చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఎఇ జోగారావు నాయుడుకు సూచించారు. ప్రస్తుతం ఉన్న రెండు బోర్లు పనిచేస్తున్నాయని ఈ సందర్భంగా గుర్తించారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న డిఇ

## చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట బస్టాండ్ వద్ద ఉన్న కాశీ విశ్వేశ్వర ఆలయం కమిటీ ఆధ్వర్యంలో గుడి వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎండలు భగభగ మండుతుండడం తోపాటు సోమవారం అధికంగా సంతకి వచ్చిన గిరిజనులు, ప్రజలకు కొంత దాహార్తిని తీర్చడానికి మజ్జిగ మంచినీరు సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అర్చకులు కేశవరావు, దేవర శెట్టి కృష్ణ, బంగారబండి జనార్ధన, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డును బాగు చేసిన 'ఎంఎస్ఆర్'

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని వెంకట భైరిపురం - డిసిర్లాం మధ్య ఉన్న కంత పోలమ్మ గుడి వరకు మరమ్మతులకు గురైన రహదారిని ఎమ్మెస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. సుమారు కిలోమీటర్ రహదారికి దాదాపు రూ.50 వేలు ఖర్చు చేసి మరమ్మతులు చేపట్టినట్లు ఆ సంస్థ ఫౌండర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో డి సిర్లాం గ్రామానికి చెందిన జాగాన శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ తేలి రామకృష్ణ, గేదెల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్‌కు వినతుల వెల్లువ

బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

**జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు వినతులు వెల్లువలా వచ్చాయి. కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములు, గెడ్డలను పరిరక్షించాలని కాంగ్రెస్ నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. భామిని మండలంలోని హత్యకు గురైన ఎస్‌టి కులానికి చెందిన యువకుడు కేసును ధర్యాప్తు చేయాలని సీతంపేట ఐడిటిఎ పిఒకు వినతి పత్రాన్ని అందించారు. ఎస్‌పి తన కార్యాలయంలో వినతులు స్వీకరించి త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని పోలీసులకు ఆదేశించారు. వీరఘట్టంలో నిర్వహించిన గ్రీవెన్సుకు అధికారులు డుమ్మా కొట్టారు..**

ప్రజాశక్తి- పార్వతీపుంర రూరల్

మండలంలోని సంగంవలస పంచాయతీ, సంగంవలస గ్రామం నుండి సీతంపేట గ్రామానికి రహదారి పనులను పూర్తి చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎపి రైతు కూలీ సంఘం నాయకులతో కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు మూడు సంవత్సరాల క్రితం రోడ్డు మంజూరైందని పనులు మాత్రం ముందుకు కదలేడం లేదని చెప్పారు. రోడ్డు నిర్మాణం సగంలో ఆపేయడంతో తమకు రాకపోకలకు ఆటంకం ఏర్పడిందన్నారు. రేషన్ వ్యాను కూడా తమ గ్రామానికి రావడం లేదని రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఈ శ్రీను నాయుడు, ఏం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

**కబ్జాకు గురైన చెరువులు, గెడ్డలు, ప్రభుత్వ స్థలాలను రక్షించాలి**

జిల్లాలో జరిగిన కబ్జాలను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఒబిసి పార్వతీపురం మన్యం జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, మండల అధ్యక్షులు తీళ్ళ గౌరీ శంకరరావు, జిల్లా నాయకులు కోలా కిరణ్ కుమార్, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా కార్యదర్శి చుక్క చంద్రరావులు కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి పార్వతీపురం పట్టణంతో పాటు జిల్లాలో జరిగిన చెరువులు, ప్రభుత్వ స్థలాలు కబ్జాపై చర్యలు తీసుకోవాలనిక కోరారు. బిళ్ళబంధ, దేవుడిబంధ, నెల్లిచెరువు, లక్ష్మనాయుడు చెరువు, కోదువానిబంధ, లంకెల చెరువు, వరహాల గెడ్డ, సంఘం నాయుడు చెరువు, రాయబంధ, తమ్మి నాయుడు చెరువు, బోటువాని చెరువు, పాత్రుడు గారి కోనేరు, కొత్తచెరువు, గోపసాగరం తదితర చెరువులు దాదాపు ఆక్రమణకు గురయ్యాయన్నారు. వీటితోపాటు పట్టణంతో పాటు నలదిక్కులా ఉన్న ప్రభుత్వ స్థలాలు కూడా కబ్జాకు గురయ్యాయన్నారు. వాటికి సర్వే చేయించి ఆక్రమణలను తొలగించాలని కోరారు. స్పందించిన జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కారించాలి:ఎస్‌పి**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి అధికారులను కోరారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు వేధింపులు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ-ఆస్థి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 10 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ ఆదాం, సిబ్బంది పాల్గొన్నారు.

**సమగ్ర దర్యాప్తు చేయాలని ఆందోళన**

**సీతంపేట:** భామిని మండలం తాలాడ గ్రామానికి ఎరుకుల ఎస్టి కులానికి చెందిన గొర్లె భీముడు హత్యపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఐటిడిఎ వద్ద గ్రామస్తులు సోమవారం ఆందోళన చేపట్టారు. సమగ్ర దర్యాప్తు చేసి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అనంతరం ఆందోళన వద్దకు పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి వచ్చి వినతి స్వీకరించారు. ఈ సందర్భంగా డిఎస్‌పితో మాట్లాడి నాయం చేస్తామన్నారు. ఈ ఆందోళనలో ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకులు సల్ల శాంతారావు, గేదెల రమణమూర్తి, గొర్లె శంకర్రావు, ఆదినారాయణ, చంద్రరావు, అసిరయ్య, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలు లేని గ్రీవెన్స్**

**వీరఘట్టం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్తు ఎఒ డి.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సమస్యలు కరువయ్యాయి. మండల ఇంజనీరింగ్, ఇఒపిఆర్‌డి, శిశు సమగ్ర శాఖలకు సంబంధించిన అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖలకు సంబంధించిన అధికారులు హాజరు కాకపోవడంతో అధికారుల కోసం వేసిన కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

**గిరిజన కళాకారులకు భరోసా కల్పించాలని కలెక్టర్‌కు వినతి**

**కురుపాం :** గిరిజన కళాకారులకు ఆర్థిక భరోసా కల్పించి ఆదుకోవాలని మండలంలోని మామిడిమానుగూడకు చెందిన బిడ్డకి నాగేశ్వరరావు సోమవారం కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సాంప్రదాయ, సంస్కృతులు, కళలు ఉట్టిపడేలా ఇతర రాష్ట్రాల్లోనూ, జిల్లాల్లో ఇలా ఎన్నో వేదికల వద్ద వేశామని, కానీ తమ కుటుంబాలకు ఆర్థికంగా భరోసా లేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం గానీ, ఉన్నతాధికారులు గాని స్పందించి మా కుటుంబాలకు ఐటిడిఎ ద్వారా గిరిజన కళాకారులకు ప్రత్యేక రుణాలిచ్చి ఆర్థిక భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఆర్థిక భరోసా కల్పించేందుకు చర్యలు చేపడుతామని అన్నారని తెలిపారు.

## ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 33 వినతులు

**సీతంపేట:** సీతంపేట ఐటిడిఎలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించారు. మెలియాపుట్టి మండలం గొడ్డ గ్రామానికి చెందిన పెద్దింటి పోలమ్మ తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. కొత్తూరు మండలం ఎగువ దొండమాను గూడ గ్రామస్తులు గ్రామానికి తాగునీటి బోరు మంజూరు చేయాలని, చాపరాయి గూడ గ్రామానికి చెందిన ఆరిక ఎల్లారు సీసీ రోడ్డు మంజూరు చేయాలని, ఎగువ సంకిలి గ్రామానికి చెందిన సవర నరేష్ వరద గోడ మంజూరు చేయాలని, కొత్తూరు మండలం బలద గ్రామంలో చేపట్టిన అంగనవాడి భవనం పెండింగ్ బిల్లును చెల్లించాలని వినతిపత్రం సమర్పించారు. దోనుబాయి గ్రామానికి చెందిన కె.సుశీల అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించాలని, దోనుబాయి బంగ్లా దుర్గమ్మ ఆలయం ప్రహరీ నిర్మాణానికి అనుమతులు ఇప్పించాలని, సర్పంచ్ కూరంగి వెంకి నాయుడు గ్రామస్తులు సమస్యను పిఒ దృష్టికి తీసుకొచ్చారు. మెలియాపుట్టి మండలం పెంగువాడ గ్రామానికి చెందిన లంబ బోడమ్మ జీడిమొక్కలు ఇప్పించాలని, భామిని మండలం కడంబసింగి గ్రామంలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని, సీతంపేట మండలం పాండ్ర సీదిమానుగూడకు చెందిన సవర జమ్మ రచ్చబండ మంజూరు చేయాలని, సీతంపేట మండలం దిబ్బగూడ గ్రామానికి చెందిన మేరీ కుట్టుమిషన్ మంజూరు చేయాలని, దుగ్గి గ్రామానికి చెందిన ఆరిక రవీంద్ర నాటు కోళ్లు పెంచుకోవడానికి రేకుల షెడ్డు మంజూరు చేయాలని వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఒ ఎపిఒ జి.చిన్నబాబు, ఈఈ రమాదేవి, డిడి అన్నదొర, పిహెచ్ఒ వెంకట గణేష్, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, డిప్యూటీ డిఇఒ రవి ప్రసన్న కుమార్, సిడిపిఒ రంగలక్ష్మి, వెలుగు ఎపిడి సన్యాసిరావు, జిసిసి మేనేజర్, దాసరి కృష్ణ, గొర్లే నరసింహులు ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

# సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో ఉన్న దీర్ఘకాల సమస్యలతో పాటు పలు సమస్యలు పరిష్కారం చేయాలని సిపిఎం పార్టీ నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ధర్నా అనంతరం తహశీల్దార్ ఏ.సాయి కామేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు రామారావు, వెంకటేష్, మధు మాట్లాడుతూ మండలంలో అనేక గిరిజన గ్రామాలకు మంచినీటి సౌకర్యం నేటికీ పూర్తి స్థాయిలో అందడం లేదన్నారు. నీటి వనరులైన వనకాబడి, గుమ్మడిగడ్డ, తోటపల్లి, జంఝావతి వంటి నీటి వనరులను పూర్తిచేయాలని గిరిజన గ్రామాల్లో ఉన్న చెక్‌డ్యామ్ పైన అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. భూ సమస్యలపైన కూడా అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని, అన్ని గిరిజన గ్రామాలకు రహదారులు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నేటికీ 10 వారాలుగా పెండింగ్ ఉన్న ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించే విధంగా వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గిరిజనులు

సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోటి కైలాస, మధు, నాని, ఎర్రప్ప, ముసిరి, గిరిజన మహిళలు, గిరిజన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తహశీల్దార్‌పై ఎంపిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం తహశీల్దార్ ఎం.రవణమ్మపై ఎంపిపి శెట్టి పద్మావతి సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో తహశీల్దార్ వల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, రైతుల సమస్యలు రెవెన్యూ ద్వారా సకాలంలో పరిష్కారం అవడం లేదని, ముటేషన్లకు రైతుల వద్ద నుండి అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారని చెప్పారు. పంట నష్టపోయిన రైతులకు హార్టికల్చర్, అధికారులు విఆర్ఒలు సంతకాలు చేసి నష్టపరిహారం అంచనా వేసినప్పటికీ తహశీల్దార్ మాత్రం సంతకం పెట్టకుండా రైతులను అనేకసార్లు తిప్పుతూ ఇబ్బంది పెడుతుందని శనివారం జరిగిన సర్వసభ సమావేశంలో పలువురు సర్పంచులు సభ దృష్టికి తీసుకువచ్చారని గుర్తు చేశారు. అధికారులు పెట్టిన సంతకాల మీద నమ్మకం లేకపోతే పంట నష్టపోయిన దగ్గరికి వెళ్లి పరిశీలించి సంతకాలు పెట్టాలి తప్ప రైతులను ఇబ్బంది పెట్టకూడదని సర్పంచులు అడిగినప్పటికీ తహశీల్దార్ తానే సుప్రీం తానే బాస్ తప్ప తానెవరికీ సబార్డినేట్ కాదని సమాధానం చెప్పడం దురదృష్టకరమన్నారు. ఆమెపై చర్యలు చేసి రెవెన్యూ సేవలపై రైతులు ఎవరూ ఇబ్బంది పడకుండా ఉండేలా చేయాలని కలెక్టర్‌ను కోరామని ఎంపిపి తెలిపారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపిపి పద్మావతి

## మట్టి నమూనాలు సేకరణ

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని వెంకటాపురంలో ఎఒ ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మట్టి పరీక్ష నిమిత్తం మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా మండలం మొత్తంగా 1244 నమూనాలు తీయవలసి ఉండగా ఇప్పటి వరకు 182 నమూనాలు తీశామని ఆయన తెలిపారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ నమూనా తీయాలంటే ముందుగా నమూనా సేకరించే క్షేత్రాన్ని ఎంచుకోవాలన్నారు. తర్వాత ఎకరానికి 8 చోట్ల రాండమ్‌గా నమూనా సేకరించాలన్నారు. 15 సెంటి మీటర్లు లోతులో వి ఆకారంలో గుంట తీసుకోవాలని, తర్వాత కింద నుండి పైన వరకు అన్ని పొరలలో మట్టి వచ్చేలా అన్ని చోట్ల మట్టి తీసుకోవాలని, అలా సేకరించిన మట్టి బాగా కలిపి క్వారంటైన్ పద్ధతిలో 500 గ్రాములు వచ్చే వరకు తీసుకోవాలని తెలిపారు. భూసార పరీక్షలు చేయించడం వల్ల ఎరువులు ఏ మోతాదులో వాడాలో, ఏ పంట వేయడానికి నేల అనుకూలంగా ఉందో తెలుస్తుందన్నారు. రైతుల ందరూ వారి గ్రామాలలోని రైతు సేవ కేంద్రంలో సిబ్బందికి మట్టి నమూనాలు సేకరణలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మట్టి నమూనాలను పరిశీలిస్తున్న ఎఒ అవినాష్

## ఉపాధి పనుల నిలుపుదలపై గిరిజనులు నిరసన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కుడుమూరు రెవెన్యూ 48 సర్వే నెంబర్లు భూముల్లో ఉపాధి పనులు చేపట్టాలని, పనులు ఇవ్వకుండా పనిచేస్తుండగా మధ్యలో వెళ్లిపోమన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గిరిజన సంఘం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సూకురు అప్పలస్వామి, కొర్ర కళ్యాణ్, వ్యవసాయ కార్మిక సంఘం సుర్రు రామారావు మాట్లాడుతూ మాట్లాడుతూ 48 సర్వే నెంబర్ కుడుమూరు భూముల్లో వారం రోజులుగా పని చేస్తున్న గిరిజనుల వద్దకు ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్రావు పనులు ఆపివేయమనడం ఎంతవరకు సమంజ సమని అన్నారు. వెంటనే పనులు కల్పించాలని కోరారు. పనులు ఎవరు ఆపమన్నారని గిరిజనులు అడ్గగా ప్రైవేటు వ్యక్తులు చెప్పారని, అందుకే పని ఆపి వేశామని ఫీల్డ్ అసిస్టెంట్ చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం ఎంపిడిఒకు వినతిని అంద జేశారు. దీనికి ఎంపిడిఒ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని, ఎపిఒ, ఫీల్డ్ అసిస్టెంట్లను పిలిపించి దీనిపై దర్యాప్తు చేసి తనకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పడాల తమ్మయ్య, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు కొర్ర శ్రీనివాసరావు, గెమ్మెల భీమయ్య, అర్జున్, సోను పోతయ్య పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ కూలీలు

## ఎడి కార్యాలయం ఏర్పాటు చేయరూ?

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లా ఏర్పడి మూడేళ్లు దాటినా ఇంతవరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి కార్యాలయం ఏర్పాటు చేయలేదని పలువురు వికలాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మన్యం జిల్లా వికలాంగుల పరిరక్షణ సేవాసమితి ఆధ్వర్యాన కొంతమంది వికలాంగులు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎడి కార్యాలయం లేకపోవడంతో తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. గతంలో నియోజకవర్గాల వారీగా నిర్వహించిన శిబిరాల్లో మంజూరైన పరికరాలను పంపిణీ చేయాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

నిరసన తెలుపుతున్న వికలాంగులు

## యువతలో సత్ప్రవర్తనకు క్రీడలు దోహదం

ప్రజాశక్తి - కురుపాం

యువత చెడు మార్గాల్లో నడవకుండా సత్ప్రవర్తనకు క్రీడలు దోహదం చేస్తాయని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని నీలకంఠాపురం ఎస్సై నీలకంఠరావు ఆధ్వర్యంలో గత 20 రోజులుగా జరుగుతున్న మెగా క్రికెట్ టోర్నమెంట్లో సోమవారం జరిగిన చివర మ్యాచ్లో గెలుపొందిన టీములకు బహుమతులు అందజేయడానికి ముఖ్య అతిథిగా ఎస్‌పి పాల్గొన్నారు. విజేతగా నిలిచిన కొండవాడ జట్టుకు రూ.10వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీని, రన్నర్‌గా నిలిచిన నీలకంఠాపురం జట్టుకు రూ.5వేలు నగదు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా యువత చెడు మార్గంలో నడవకుండా ఉండేందుకు క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్‌లను పలు పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.కావున యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నీలకంఠాపురం పరిసర గ్రామాల్లో గల 500 మంది గిరిజన ప్రజలకు దుప్పట్లు, గొడుగులను, యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాలకొండ డిఎస్పి రాంబాబు, సిఐ హరి, ఎస్సై పి.నారాయణరావు పోలీస్ సిబ్బంది ,యువత పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

మృతి చెందిన తలగపు రమేష్

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - కొమరాడ

రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ కె.నీలకంఠం తెలిపారు. సోమవారం తులసివలస గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం సిమెంట్ స్తంభానికి ఢీకొని ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఇందిరా నగరానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు తలగపు రమేష్ (41) తాపీ పని నిమిత్తం తులసివలసకు తన మోటార్ సైకిల్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తూ రోడ్ పక్కన ఉన్న సిమెంట్ స్తంభానికి ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు రమేష్‌ను కురుపాం హాస్పిటల్ కి తీసుకెళ్లినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. రమేష్ భార్య సుమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రమేష్ స్వగ్రామం కుమ్మరిగుంట గ్రామం అని తెలిపారు.

### నాటుసారా స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది సోమవారం సాయంత్రం జియ్యమ్మవలస మండలంలో చినమేరంగి, గడసింగుపురం గ్రామాల్లో దాడులు నిర్వహించి వెయ్యి లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. గరుగుబిల్లి రాజు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా నాటుసారా అమ్మినా, తరలించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జె.రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

## డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఆదివాసీలకు అన్యాయం

ప్రజాశక్తి - సీతంపేట

ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఆదివాసీలకు అన్యాయం జరిగిందని గిరిజన జెఎసి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం జెఎసి జిల్లా అధ్యక్షులు బిడ్డిక శ్రీనివాసులు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ, జీవో 3 స్థానంలో కొత్త జీవోను ఏర్పాటు చేసి ఆదివాసీలకు న్యాయం చేసేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఐటిడిఎ పరిధిలో గల డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టులు శత శాతం గిరిజనులకే ఇవ్వాలని కోరారు. ఇటీవల కాలంలో ఐదో షెడ్యూల్ పరిధిలో గల పీసా కమిటీలను ఏర్పాటు చేసి ఉపాధ్యక్షులు, కార్యదర్శుల ఎన్నికలు చేపట్టి వారికి చట్టపరంగా నియమించినా, ఎటువంటి అధికారాలు ఉన్నాయో ప్రభుత్వం పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి, వెంటనే మండల స్థాయి అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులను నియమించాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టం పటిష్టంగా అమలుపర్చి ప్రభుత్వ భూములు, ఎల్‌టిఆర్ కేసులపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో ఆదివాసీ జెఎసి ఉపాధ్యక్షులు సవర చిరంజీవులు, సీతంపేట ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ కార్యదర్శులు బిడ్డిక ఉమామహేశ్వరరావు, కొండగొర్రి భాస్కరరావు, తోయిక తిరుమలరావు, సవర విష్ణు, బిడ్డిక రామ్మోహన్ రావు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు సోమవారం నుంచి పార్వతీపురంలో ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డిడి ఆర్.కృష్ణవేణి తెలిపారు. కావున గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులంతా తమ పరిధిలోని టెన్త్ ఫెయిలైన ఆశ్రమ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులను పార్వతీపురం జరుగుతున్న తప్పకుండా స్పెషల్ కోచింగ్ సెంటర్లలో చేర్పించాలని ఆమె ఆదేశించారు. ప్రత్యేక శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా కోచింగ్, వసతి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు ఆమె చెప్పారు. బాలుర కోసం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, బాలికలకు గిరిజన సంక్షేమ పోస్టుమెట్రిక్ వసతి గహం (బాలికలు)లో శిక్షణ, వసతి కల్పించామని అన్నారు. కావున ఉత్తీర్ణత సాధించని విద్యార్థినీ విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.